క్లుప్తంగా

సమాజ సేవలో భగవంతుడిని చూడాలి



విజయవాడ కల్చరల్: సమాజ సేవలో భగవంతుడిని చూడాలని బ్రాహ్మణ సంఘనేత ఏలేశ్వరపు జగన్మోహనరాజు సూచించారు. అంతిమ సంస్కార, ఎలైట్ బ్రాహ్మిన్, భారతీయ కరివెన అన్నదాన సత్రం ఆధ్వర్యాన బీఆర్‌టీఎస్ రోడ్డులోని గాయత్రీ కన్వెన్షన్‌లో వరద ప్రాంతాల్లో సర్వం కోల్పోయిన బ్రాహ్మణులకు నిత్యావసరాలు, దుస్తులు పంపిణీ చేశారు. పాయకాపురం, సింగ్‌నగర్, ప్రకాశ్‌నగర్, పైపుల రోడ్డులోని 500 మందికి దాతల సహకారంతో నిత్యావసరాలు అందించారు. చెరువు రామకోటయ్య, పీవీఎస్‌డీఎమ్ శర్మ, కొప్పరపు బలరామ కృష్ణమూర్తి, జింకా చక్రధర్, పులుపుల సాయి పాల్గొన్నారు.

పైపులరోడ్డు వద్ద వ్యర్థాల డంప్



పాయకాపురం(విజయవాడరూరల్): జక్కంపూడి–పైపులరోడ్డులో రాకపోకలు స్తంభించడంతో పరిసర ప్రాంతాల్లో వరదలకు తడిసి పాడైపోయి పనికిరాని వస్తువులను రోడ్డుపై డంప్ చేస్తున్నారు. వరదల్లో కొట్టుకొచ్చిన సామగ్రి మొత్తాన్ని పైపులరోడ్డు నుంచి జక్కంపూడి రింగ్ వరకు వాహనాల్లో తీసుకొచ్చి డంప్ చేస్తున్నారు. ప్రస్తుతం అంబాపురం ఒకటవ వార్డులో వరద నీటిని రింగ్ రోడ్లకు గండ్లు పెట్టి బయటకు పంపుతున్నారు. ఈ పరిస్థితి నుంచి ఇంకా తేరుకోకముందే పనికిరాని వస్తువులు, వ్యర్థాలను ఈ రోడ్డులో డంప్ చేయడం పట్ల స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పటమట(విజయవాడతూర్పు): జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో పారిశుద్ధ్య పనులను మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర శుక్రవారం పరిశీలించారు. కాలనీలో నీటి సరఫరా చేసే మోటార్ వరదల కారణంగా పాడవడంతో కొత్తది ఏర్పాటుచేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో అడిషినల్ కమిషనర్ (జనరల్) డాక్టర్ ఏ మహేష్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏఏ ఎస్ఎస్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): పోలీసు నిబంధనలు, మోటారు వాహన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మూడవ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె. కిషోర్‌బాబు వాహనదారులకు సూచించారు. శుక్రవారం సత్యనారాయణపురంలోని సీతన్నపేట గేటు వద్ద కార్లకు బ్లాక్ ఫిల్మ్‌లపై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా బ్లాక్ ఫిల్మ్‌తో నడుస్తున్న ఆరు కార్లను అదుపులోకి తీసుకుని స్టిక్కర్‌లను తొలగించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మనసు కవికి స్వర నీరాజనం



విజయవాడ కల్చరల్: గీతాంజలి మ్యూజిక్స్, రాగలహరి, కామ్రేడ్ జీఆర్‌కే, పోలవరపు సాహితీ సమితి ఆధ్వర్యంలో సినీగేయ, నాటక రచయిత ఆత్రేయ జయంతి సందర్భంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన ఆత్రేయకు స్వర నీరాజనం కార్యక్రమం ఆకట్టుకుంది. గాయనీ గాయకులు డాక్టర్ జయంతి చక్రవర్తి, స్వాతి, భాగ్యశ్రీ, హరికృష్ణ, మోహన్‌రాజ్, రాజ్‌కిషోర్, అయ్యప్పన్ ఆత్రేయ రచించిన గీతాలను ఆలపించారు. డాక్టర్ దామోదర గణపతి అధ్యక్షత వహించారు. జయంతి చక్రవర్తి మాట్లాడుతూ తెలుగు సినీ సంగీత అభిమానుల మనసు గెలిచిన కవి ఆత్రేయ అని అభివర్ణించారు. తెలుగు పాటకు, సాహిత్యానికి కీర్తి ప్రతిష్టలు ఆర్జించి పెట్టిన ఆత్రేయను తెలుగు పాట ఉన్నంత వరకు అభిమానులు గుర్తుకు తెచ్చుకుంటారని పేర్కొన్నారు.

అంకమ్మతల్లికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీకాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో శుక్రవారం ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయి. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

మురుగులోనే ఆవాసం

- వరద బాధితులను పట్టించుకోని ప్రభుత్వం
- అంటువ్యాధుల భయంతో ఆందోళనలో ప్రజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్) / పాయకాపురం(విజయవాడరూరల్): బుడమేరు మధ్యకట్ట విజయదుర్గానగర్‌లో వరద బాధితులు 13 రోజులు దాటినప్పటికీ వరద మురుగులోనే ఆవాసం చేస్తున్నారు. ఇక్కడ వరద ఉధృతి తగ్గినప్పటికీ బుడమేరు పక్కనే ఉన్న నివాసాల్లో నీరు తొలగిపోలేదు. వరద నీరు నిలిచిపోయి మురుగుగా మారి దుర్వాసన వెదజల్లుతోంది. ఇప్పటికే బుడమేరు వరద ప్రభావంతో సర్వం కోల్పోయిన బాధితులు ఇప్పుడు మురుగు, దుర్వాసనలతో అంటువ్యాధులు ప్రబలుతాయేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం మార్చుకునేందుకు దుస్తులు సైతం లేకపోవడంతో నానా యాతన పడుతున్నారు. వరద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం మూడు రోజులుగా ఆహారం, తాగునీటి సరఫరా నిలిపివేయడంతో వారు ఆకలిదప్పులతో అలమటిస్తున్నారు. దీంతో ఎవరైనా దాతలు వచ్చి సాయం చేస్తారేమోనని బాధిత కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి. వరదలతో ఒక్కో ఇంటికి లక్ష రూపాయల వరకు నష్టం జరిగిందని బాధితులు చెబుతున్నారు. టీవీ, ఫ్రిజ్, మంచం, గ్యాస్‌పొయ్యి, గృహోపకరణాలు వరదల్లో పాడైపోయాయి. ప్రభుత్వం నుంచి ఏమైనా వంట పాత్రలు అందుతాయని ఎదురుచూస్తుంటే ఆహారం, తాగునీరు కూడా నిలిపివేశారని బాధితులు అంటున్నారు. వీధులన్నీ వ్యర్థాలతో దుర్వాసనలు వెదజల్లుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన సహాయ చర్యలు చేపట్టి బాధితులను ఆదుకోవాలని కోరుతున్నారు.



రాజీవ్‌నగర్‌లో రోడ్డుపైనే వ్యర్థాలు



బుడమేరు మధ్యకట్టలో నిలిచిన మురుగు

కట్టుబట్టలతో మిగిలాం



బుడమేరు వరద ప్రభావానికి సర్వం కోల్పోయాం. కళ్లెదుటే ఇంట్లోని వస్తువులు కొట్టుకుని పోతుంటే నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయాం. కనీసం మార్చుకునేందుకు దుస్తులు కూడా లేవు. తినడానికి ఆహారం, సరుకులు ఇచ్చారు. కానీ మార్చుకునేందుకు దుస్తులు లేక అవస్థలు పడుతున్నాం. ఇక్కడ పేరుకుపోయిన చెత్తచెదారం తీసుకువెళ్లడం లేదు.

– నల్లి భూలక్ష్మి, బుడమేరు మధ్యకట్ట

పారిశుద్ధ్య సిబ్బంది పట్టించుకోలేదు



13 రోజులు దాటినా ఇంట్లోని వరద నీరు పూర్తిగా తగ్గిపోలేదు. దీంతో తెలిసిన వారి ఇంట్లో తలదాచుకుంటున్నాం. ఇంట్లో వస్తువులు ఏమీ మిగలలేదు. ముఖ్యంగా మంచాలు, పరుపులు, చెక్క సామగ్రి పూర్తిగా నాశనం అయ్యాయి. ఇంట్లోని చెత్తను తీసుకువెళ్లమంటే నగరపాలకసంస్థ సిబ్బంది రోడ్డుపైకి తీసుకువచ్చి ఇవ్వాలని అంటున్నారు. చెత్తచెదారంతో అంటువ్యాధులు వస్తాయేమోనని ఆందోళనగా ఉంది.

– సక్కా ఆదిలక్ష్మి, విజయదుర్గానగర్

ఆహారం, తాగునీరు లేవు



వరదల్లో ఇబ్బందులు పడుతున్నా ఇంతవరకు ప్రభుత్వ అధికారులు కన్నెత్తి చూడలేదు. బురదలో తినడానికి తిండి, తాగడానికి నీరు లేకున్నా..ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. వీధులన్నీ వ్యర్థాలతో నిండి దుర్వాసన వస్తోంది. నానా అవస్థలు పడుతున్నాం.

–విక్రమ్ మంగ, రాజీవ్‌నగర్

రాకపోకలు బంద్

- 13 రోజులుగా కనీస చర్యలు శూన్యం
- ప్రమాద హెచ్చరికలు సైతం ఏర్పాటు చేయని వైనం

మధురానగర్(విజయవాడసెంట్రల్): రామకృష్ణాపురం దేవీనగర్ మెయిన్ రోడ్డు రైల్వే బ్రిడ్జి వద్ద వరదనీరు నిలవడంతో 13 రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో రామకృష్ణాపురం నుంచి దేవీనగర్ వెళ్లాల్సిన వారు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. కొత్తగా వచ్చిన వాహన చోదకులు వరద నీరు కొద్దిగానే ఉందని భావించి నీటిలో వెళ్లి ఇరుక్కుపోతున్నారు. ఇక్కడ ప్రమాదకరంగా ఉందని వాహన చోదకులు వెళ్లరాదని కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో ఇప్పటికే పలువురు తెలియక వరదనీటిలో ఇరుక్కుని వాహనాలు పాడైపోయి నానాయాతన పడ్డారు.

కనీస చర్యలు శూన్యం

నిత్యం రద్దీగా వేలాది మంది ప్రయాణాలు సాగించే ఈ మార్గంలో రాకపోకలు పునరుద్ధరించడానికి కనీస చర్యలు తీసుకోలేదు. 13 రోజులుగా ఇక్కడ రాకపోకలు నిలిచిపోయినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. చుట్టూతిరిగి రావడం వల్ల విలువైన సమయంతో పాటు ఇంధనం వృథా అవుతుంది. దేవీనగర్‌కు చెందిన కొంత మంది వృద్ధులు ఇక్కడ వరద నీరు ఎక్కువగా ఉందని వాహనాలు వెళ్లవద్దంటూ చెబుతున్నారు. దీంతో అక్కడి వరకు వచ్చిన వాహనచోదకులు వెనక్కి తిరిగి వెళ్లిపోతున్నారు. కొంతమంది మూర్ఖంగా వరదనీటిలో వెళ్లి ఇరుక్కుపోతున్నారు.



రామకృష్ణాపురం దేవీనగర్ రోడ్డు రైల్వే బ్రిడ్జి వద్ద వరదనీటిలో వస్తున్న ట్రాక్టర్

వరద ప్రాంతాల్లో శానిటేషన్ త్వరగా పూర్తి చేయాలి

మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

సాక్షి, అమరావతి: విజయవాడలోని వరద ప్రభావిత కాలనీల్లో మున్సిపల్ సిబ్బందిని మరింత ఎక్కువ మందిని నియమించి శానిటేషన్‌ను వీలైనంత త్వరగా చక్కదిద్దాలని వైఎస్సార్ సీపీ మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సూచించారు. విజయవాడలోని వరద ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. అనంతరం మల్లాది విష్ణు మీడియాతో మాట్లాడారు. వరదల కారణంగా కొద్దిరోజులుగా ఇంటికి దూరంగా ఉన్న ప్రజలందరూ తమతమ ఇళ్లకు చేరుకొన్నారన్నారు. ఈ సందర్భంగా తాను పరిశీలించినవి, 10 రోజుల తర్వాత ప్రజలు ఇళ్లకు చేరుకొని తమ దృష్టికి తీసుకొచ్చిన పలు సమస్యలను వివరించారు. వరద ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన మున్సిపల్ శాఖ డ్రైనేజీలు క్లీన్ చేయాలని కోరారు. డ్రైనేజీల్లో స్ప్రే చేపట్టాలని నీటి నిల్వలు ఉన్నచోట వేస్ట్ ఆయిల్ బాల్స్ వేయించాలని సూచించారు. లేఅవుట్స్ వేసిన ప్రాంతాల్లో చాలా చోట్ల నీరు ఇప్పటికీ అలాగే నిల్వ ఉండిపోయిందని, ఆ నీటిని తొలగించి మలాపియన్ స్ప్రే చేయించాలని పేర్కొన్నారు.

సింగ్‌నగర్ బాధితులకు కూర'గాయాలు'

- రైతుబజార్లను పట్టించుకోని అధికార యంత్రాంగం
- అందరికీ అందని సబ్సిడీ కూరగాయలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదు అన్నట్లు ఉంది అజిత్‌సింగ్‌నగర్ రైతుబజార్ పరిస్థితి. సింగ్‌నగర్ ప్రాంతాన్ని వరద వీడి వారం రోజులు అవుతున్నప్పటికీ ఫ్లైఓవర్ పక్కనే ఉన్న ఈ రైతుబజార్‌ను పునఃప్రారంభించేందుకు అధికారులు చొరవ చూపడంలేదు. ఇక్కడ మొత్తం 39 స్టాల్స్ ద్వారా కూరగాయలు విక్రయిస్తుంటారు. నిత్యం వినియోగదారులతో రద్దీగా ఉండే ఈ రైతుబజార్ బుడమేరు వరద తాకిడికి మూతబడి వెలవెలబోతోంది. మార్కెటింగ్ శాఖ అధికారులు రైతుబజార్‌ను పునఃప్రారంభించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత నెల 31న బుడమేరు వరద ఉధృతికి సింగ్‌నగర్ ప్రాంతంలోని ఇళ్లతోపాటు ఫ్లైఓవర్ పక్కనున్న రైతుబజార్ కూడా నీట మునిగింది. అప్పటి నుంచి ఈ రైతుబజార్‌తోపాటు పాయకాపురం రైతుబజార్ కూడా మూతపడింది. ప్రభుత్వం సబ్సిడీతో విక్రయిస్తున్న కూరగాయలు బాధితులు అందరికీ చేరడంలేదు. బహిరంగ మార్కెట్‌లో కూరగాయలు అధిక ధరలు పలుకుతుండటంతో సర్వం కోల్పోయిన బాధితులు కొనలేక ఇబ్బందులు పడుతున్నారు. విధి లేక ధర్నాచౌక్, జ్యోతి కళాశాల, కేదారేశ్వరరావు పేట రైతుబజార్లకు వెళ్లి కూరగాయలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పాయకాపురం, సింగ్‌నగర్ రైతుబజార్లను అందుబాటులోకి తీసుకొస్తే సింగ్‌నగర్, ఇందిరానాయక్‌నగర్, నందమూరినగర్, ఆంధ్రప్రభకాలనీ, లూనా సెంటర్, వాంబేకాలనీ, డాబాకొట్లు సెంటర్, సన్‌సిటీ కాలనీ, ఆర్ఆర్‌పేట, కండ్రిక, రాజీవ్‌నగర్, శాంతినగర్, ప్రశాంతి నగర్, సుందరయ్య నగర్ తదితర ప్రాంత ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది.

రైతుబజార్ నిండా చెత్తచెదారం

బుడమేరు వరద ప్రవాహానికి సింగ్‌నగర్ రైతుబజార్ ఆవరణమంతా చెత్తచెదారంతో అధ్వానంగా తయారైంది. సంచులు, ఇతర వ్యర్థాలు కుళ్లిపోయి దుర్వాసన వ్యాపిస్తోంది. పారిశుద్ధ్య సిబ్బంది శానిటేషన్ పనులు చేపట్టేందుకు వెనకాడుతున్నారు. అంతేకాకుండా ఎక్కడి నుంచో చెత్తను తీసుకొచ్చి రైతుబజార్ ముందే రోడ్డు మీద డంప్ చేస్తున్నారు. దీంతో ఆ పరిసరాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. వారం రోజులుగా చెత్త కుప్పను ఇక్కడ నుంచి తరలించకపోవడంతో దుర్గంధం వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రైతుబజార్ పరసరాలను శుభ్రపరిచి త్వరగా తెరిచేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



మూతపడిన సింగ్‌నగర్ రైతుబజార్



అధ్వానంగా రైతుబజార్ ఆవరణం

త్వరగా రైతుబజార్లను ప్రారంభించాలి



వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వం సంచార రైతుబజార్ల ద్వారా విక్రయిస్తున్న కూరగాయల వాహనాలు మా వైపు రావడంలేదు. బహిరంగ మార్కెట్‌లో ధరలు మండిపోతున్నాయి. సింగ్‌నగర్ ప్రాంతంలోని రైతుబజార్లను అందుబాటులోకి తీసుకొస్తే సబ్సిడీ కూరగాయలు అందని వారు రైతుబజార్లలో కొనుగోలు చేస్తారు. త్వరగా రైతుబజార్లను ప్రారంభించాలి.

–ఆర్.వెంకటరమణ, సింగ్‌నగర్

కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరదకు సంబంధించి ముందస్తు హెచ్చరికలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు విమర్శించారు. బుడమేరు వరద ప్రాంతాలైన అజిత్ సింగ్‌నగర్, పీఅంట్‌టీకాలనీ, షాదీఖానా, సుందరయ్యరోడ్, శివాలయం సెంటర్, రాజీవ్‌నగర్, రాధానగర్, వాంబేకాలనీ, న్యూరాజరాజేశ్వరిపేట తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. సీపీఎం పార్టీ ఏర్పాటు చేసిన భోజన కేంద్రాల్లో బాధితులకు ఆహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పార్టీ ఆధ్వర్యంలో ఆరుచోట్ల భోజన కేంద్రాలు ఏర్పాటు చేసి ఇప్పటికీ కొనసాగిస్తున్నామని చెప్పారు. బుడమేరు విపత్తుకు కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఇంతవరకు బాధితులకు నయా పైసా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచినీటి ట్యాంకర్లు కొన్ని ప్రాంతాలకు రావడం లేదన్నారు. వరదల్లో సర్వస్వం కోల్పోయి బాధితులు నిస్సహాస్థితిలో ఉన్నారన్నారు. వాహనాల ఇన్సూరెన్స్ గురించి ప్రభుత్వం చెప్పిన హామీలు అమలుకు నోచుకోవడం లేదని పేర్కొన్నారు. తక్షణమే పరిహారం ప్రకటించి బాధితులకు అందజేయాలని డిమాండ్ చేశారు. పర్యటనలో సీపీఎం నేతలు బీ రమణ రావు, కే దుర్గారావు, టీ ప్రవీణ్, కే కళ్యాణ్, రాము, సీహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వరద బాధితులకు ఆహారం అందిస్తున్న సీపీఎం నాయకుడు సీహెచ్ బాబూరావు

బాధితులకు స్వచ్ఛంద సాయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద ప్రభావానికి సర్వం కోల్పోయిన బాధితులకు పలు సేవా సంస్థలు, దాతలు స్వచ్ఛందంగా సాయం అందిస్తున్నారు. బాధితులకు నిత్యావసర సరుకులు, పండ్లు, కూరగాయలు అందజేస్తున్నారు.

800 మందికి నిత్యావసర కిట్ల పంపిణీ

సత్యనారాయణపురం శ్రీవిజ్ఞాన విహార పాఠశాలలో శుక్రవారం వరద బాధితులకు 800 నిత్యావసర సరుకుల కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశాఖపట్నం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ముఖ్యఅతిథిగా పాల్గొని బాధితులకు కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన కిట్లు అందజేస్తున్న శ్రీ విజ్ఞాన విహార పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. పాఠశాల సంకుల్ అధ్యక్షుడు బీవీఎస్‌టీ సాయి, హెచ్ఎం లలిత, విభాగ్ ప్రచారక్ డీ నవీన్ పాల్గొన్నారు.

క్రీస్తు సంఘం ఆధ్వర్యంలో...

చుట్టుగుంట, తాడిగడప, గూడవల్లి క్రీస్తు సంఘం ఆధ్వర్యాన శుక్రవారం వరద బాధితులకు నిత్యాసర సరుకులు, పండ్లు, కూరగాయలు, దుప్పట్లు, టవల్స్ పంపిణీ చేశారు. సంఘ సేవకులు డీ అశోక్‌కుమార్, అప్పారావు, పిల్లల వెంకటస్వామి, సిద్దాబత్తుల అప్పారావు మాట్లాడుతూ తమవంతు బాధ్యతగా దాతలు, సేవకుల సాయంతో బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్నట్లు తెలిపారు. అలాగే బుడమేరు మధ్యకట్ట, దేవీనగర్, దావు బుచ్చయ్యకాలనీలో నగరపాలకసంస్థ సిబ్బంది పండ్లు, బిస్కట్, న్యూడిల్స్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.



బాధితులకు నిత్యావసర కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు



దుప్పట్లు, కూరగాయలు అందిస్తున్న క్రీస్తు సంఘం సభ్యులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ వైర్ల మరమ్మతుల కారణంగా ముత్యాలంపాడు సెక్షన్ లోటస్, కేదారేశ్వరపేట ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఈఈ బీవీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోటస్ సెక్టార్ ఒకటి, మూడు, లోటస్ ల్యాండ్‌మార్క్ మెయిన్ రోడ్డు, కేదారేశ్వరపేట జీరో లైన్ నుంచి ఐదో లైను వరకు, శాంతినగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కాచిన నీటినే తాగండి

పటమట(విజయవాడతూర్పు): వరద ప్రభావిత ప్రాంతాల్లో నగరపాలక సంస్థ సరఫరా చేస్తున్న నీటిని కాచి చల్లార్చి వినియోగించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వీఎంసీ కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న నీరు వాడుకోవడానికేనని, 62,63,64 డివిజన్లలో లోతట్టు ప్రాంత ప్రజలు మరో రెండు రోజులవరకు తాగునీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. త్వరలోనే తాగునీటిని పునరుద్ధరిస్తామని ఆయన పేర్కొన్నారు.

'స్వచ్ఛతాహి'కి ప్రణాళిక సిద్ధం చేయండి

పటమట(విజయవాడతూర్పు): స్వచ్ఛతే సేవగా భావించి 'స్వచ్ఛతాహి సేవ' నినాదంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలకనుగుణంగా ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వ తేదీ వరకు స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఓ ప్రకటనలో ఆదేశించారు. బుడమేరు వరదల తర్వాత నగర ప్రజలకు స్వచ్ఛతలో సహాయపడుతూ, ప్రజలను, వివిధ కళాశాల విద్యార్థినీ విద్యార్థులతో స్వచ్ఛత కార్యక్రమాలు రూపొందించేటట్టు ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకోండి

పటమట(విజయవాడతూర్పు): ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్టెల్లా కళాశాల ప్రతినిధి ఇన్నాసియా అన్నారు. స్టెల్లా కళాశాల అధ్యాపక, పూర్వ విద్యార్థినులు మేనేజ్మెంట్ విద్యార్థులు, విశ్రాంత అధ్యాపకులు శుక్రవారం వరద బాధితులకు పాయకాపురంలో దుస్తులు సామగ్రి, క్లీనింగ్ మెటీరియల్స్, బ్లీచింగ్ పౌడర్, ఫినాయిల్, డేటల్ మోపింగ్ స్టిక్స్ కొవ్వొత్తులు దుప్పట్లు, టవల్స్ తదితర వస్తువులు అందించారు. అనంతరం కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు స్వచ్ఛత పక్వాడ నిర్వహించి వీధులను శుభ్రం చేశారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ హారిక, సుబ్బయ్య, లావణ్య, డిగ్రీ వైస్ ప్రిన్సిపాల్ ఉష కుమారి, ఇంటర్ వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, ఇతర అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు

పుచ్చలపల్లి సుందరయ్య హైస్కూల్‌లో పరిశుభ్రత చర్యలు

పాయకాపురం(విజయవాడరూరల్): వరద నీటిలో మునిగిన పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్ తరగతి గదులు, రికార్డు, స్టాఫ్ రూమ్, సైన్స్ లేబరేటరీతోపాటు హెచ్ఎం గదులను శుక్రవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు సిబ్బంది శుభ్రం చేశారు. గదుల్లో తడిపోసిన రికార్డులను, సర్టిఫికెట్లను ఆరబెట్టుకుంటున్నారు. సైన్స్ లేబరేటరీలో ఉన్న విలువైన సామగ్రి సైతం బురదనీటిలో మునిగి ఉండటంతో వాటిని బయటకు తీసి శుభ్రం చేశారు. అడ్మిషన్ రిజిస్టర్లు, స్టూడెంట్స్ రిజిస్టర్లు, టీసీ పుస్తకాలు, కంప్యూటర్లు, ఫ్యాన్లు, ఐఎఫ్‌సీ ప్యానెల్స్ సైన్స్ ల్యాబ్, స్పోర్ట్స్ పరికరాలు, కుర్చీలు, టేబుల్స్, అడ్మిషన్ ఫారాలు పూర్తిగా పాడైపోయాయి. పది అడుగుల లోతు నీటిలో తడిసి పాడైనట్టు ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ మైనం హుస్సేన్ తెలిపారు. వ్యర్థాలను ప్రత్యేకంగా ట్రాక్టర్‌లో డంప్ చేసి బయటకు పంపారు.



తడిసిన పుస్తకాలను తీసుకొస్తున్న విద్యార్థులు

ప్రజా ఉద్యమనేత సీతారాం ఏచూరి

విజయవాడ కల్చరల్: ప్రజా ఉద్యమనేత సీతారాం ఏచూరి అని కామ్రేడ్ జీఆర్‌కే సంస్థ వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు అన్నారు. కామ్రేడ్ జీఆర్‌కే, పోలవరపు సాహితీపీఠం, శ్రీ కళాభారతి, తెలుగు కళావాహిని ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదిక మీద శుక్రవారం సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు సీతారాం ఏచూరి సంస్మరణ సభను నిర్వహించారు. నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఆయనకు ప్రజాపోరాటంతో సంబంధాలు ఏర్పడ్డాయన్నారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ సీతారాం ఏచూరి మృతి రాజకీయ రంగానికి తీరనిలోటన్నారు. అనంతరం సీతారాం చిత్ర పటానికి శ్రద్ధాంజలి ఘటించారు. సాహితీ సంస్థల ప్రతినిధులు బోడి ఆంజనేయరాజు, డేవిడ్ రాజు, శింగంశెట్టి చంద్రశేఖర్, గాయకులు ప్రిన్స్, బీవీ వీరభద్రరావు, జయరాజు, మేకప్ రాజు పాల్గొన్నారు.



సీతారాం సంతాప సభలో సాహితీ కళా సంస్థల ప్రతినిధులు

ఇంట్లో బురద.. వీధిలో అవస్థలు..



సింగ్‌నగర్ నుంచి నున్న వెళ్లే రోడ్డులో వరద నీరు పోవడానికి కొట్టిన గండి

బుడమేరు శాంతించినా.. బాధితులకు కష్టాల 'వరద' వెంటాడుతూనే ఉంది. ముంపు తగ్గి నీళ్లు పోయినా బయట మురుగు, చెత్త.. ఇంట్లో బురదతో వరద బాధిత ప్రాంతాల ప్రజలు అల్లాడిపోతున్నారు. పలుచోట్ల బాధితులు వారి సామగ్రిని రోడ్డుపై వేసి ఆరబెడుతున్నారు. ఇళ్లలో బురదను శుభ్రం చేయడానికి ఫైరింజన్లు వచ్చినా అవి అంతర్గత వీధుల్లోకి వెళ్లకపోవడంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. స్వచ్ఛంద సంస్థలు అందజేస్తున్న ఆహారం, ఇతర సాయం కోసం ప్రజలు భారీ క్యూలో నిల్చుంటున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



కండ్రిక వద్ద స్వచ్ఛందసంస్థ తీసుకొచ్చిన నిత్యావసరాల కోసం క్యూ



కబేళా సమీపంలో బొమ్మసాని నగర్ వద్ద ఇంటిని శుభ్రం చేసుకుంటున్న దృశ్యం

మనోహరంగా సాగిన గాత్ర కచేరి

విజయవాడ కల్చరల్: స్వర తరంగిణి నెల వారీ సంగీతోత్సవంలో భాగంగా గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదిక మీద శుక్రవారం వర్ధమాన సంగీత కళాకారులు గండూరి లక్ష్మీహర్షిత, హైదరాబాద్‌కు చెందిన చినముక్కేవి సంజన నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరి మనోహరంగా సాగింది. సంజన శుద్ధ సన్యాసి రాగంతో ప్రారంభించి శ్రీమాన్ నల్లాన్ బుచ్చయ్యాచార్యులు రచించిన కీర్తన శ్రీవిద్యాగణేష, త్యాగరాజస్వామి రచించిన కీర్తన సాధించెనే మనసా, అనురాగములేని, నిరవధి శుఖదా, స్వాతి తిరునాళ్ రచించిన సరసినాభ తదితర కీర్తనలు ఆలపించారు. వయోలిన్‌పై బీవీఎస్ శ్రీకృష్ణ, షణ్ముఖ శ్రీవాత్సవ, మృదంగంపై అనిల్‌కుమార్ సహకరించారు. సంగీత విద్వాంసులు బుచ్చయ్యాచార్యులు, వేమూరి విశ్వనాథ్, గండూరి శ్రీనివాస మూర్తి పాల్గొన్నారు.



గాత్ర సంగీత కచేరి నిర్వహిస్తున్న లక్ష్మీహర్షిత